# వైజయంతి

వైజయంతిని ఒకమాటు చూసినవాళ్ళు ఎన్నటికీ మర్చిపోరు. ఆమె కూడా అంతే! పరిచయం అయితే పేరు, ఊరుతో సహా అన్నీ గుర్తుంచుకుంటుంది. మొదటి విషయానికి కారణం ఆమె అందం. అది కూడా అసాధారణం. బహుశా దాన్ని సౌందర్యం అనాలేమో.

రెండో విషయానికి కారణం ఆమె చొరవ, జ్ఞాపకశక్తి. చాలామంది ఆమె చొరవని అపార్థం చేసుకోవడం జరిగింది. కొందరు ప్రేమ అనుకున్నారు. మరికొందరు ఇష్టం అనుకున్నారు. ఇంకేవేవో అనుకున్నారు. అందుకామె బాధ్యత ఎంతమాత్రం లేదు.

"శాపవశాత్తూ భూమిమీద జన్మించిన అప్సరస" అన్నారు కొందరు భావకవులు.

ఆమె ఒక అగ్ని. వ్యామోహం పుట్టినవాళ్ళంతా శలభాలు" అన్నాడో కసికవి!

కొన్నింటిని ఆమె వింది. చాలా విషయాలు ఆమెకు తెలియవు. నాకు తెలుసు. ఎందుకంటే నేను వైజయంతికి నీడలా మసలినవాణ్ణి.

వైజయంతి వరసకి నాకు మేనత్తకూతురు. ఇద్దరికీ వయసులో రోజుల తేడా. నన్ను "ఏరా, అనేది. నేనే 'ఏమే' అనేవాణ్ణి. ఇద్దరం కొన్నాళ్ళు కలసి చదువుకున్నాం. మొగుడూ పెళ్ళాల ఆటలు ఆడుకున్నాం.

వైజయంతిది దబాయింపు సెక్షను. అందరిమీద పెత్తనం చెలాయించేది. కొందరికి పుటకతోనే అలాంటి పెత్తందారి మనస్తత్వం వస్తుందేమో. నాచేత తన పుస్తకాలు మోయించేది.

నేను సంతోషంగా మోసేవాణ్ణి. లంచంగా నాకు పచ్చిమిరపకాయ బజ్జీలు కొనిపెట్టేది. తనే... మొదటి మాటు వాటిని రుచి చూపించింది.

పచ్చిమిరపబజ్జీ మధ్యకి చీల్చి, మసాలా వేసి, ఉల్లిపాయముక్కలు వేసి, నిమ్మకాయ పిండి, కాస్తంత కొత్తిమీర వేసి ఇచ్చేవాడు బజ్జీలబండి భగవాన్లు. ఆ రుచి మర్చిపోవడం ఎవరితరం!

వైజయంతి గారాలకూన, దండిగా డబ్బులుండేవి. హాయిగా ఏంకావాలన్నా కొనుక్కునేది. ఉప్పు, కారం అద్దిన మామిడికాయ ముక్కలు, రాతి ఉసిరికాయలు, సీమచింతకాయలు, ఈతపళ్ళు, జామకాయలు, బజ్జీలు, ముంతకింద పప్పు.. దానిష్టం!

చెప్పాగా... దాని పుస్తకాలు మోసినందుకు నాకూ పెట్టేది. దూరంగా ఆకాశంలో మెరిసింది.

అవును. వైజయంతి మెరుపులాగానే ఉండేది. ఆమె ఉన్నచోట అంతా ఆమెనే చూసేవారు. వెళ్ళిపోయాక వెలితిగా ఉండేది.

విధివిన్యాసాలంటే నాకు చాలా కోపం. పసితనాన్ని బలవంతంగా లాగేసుకుంటుంది. పెద్దరికాన్ని పులుముతుంది. బాధ్యతల కావిళ్ళు భూజాన తగిలిస్తుంది. ఆత్మీయుల్ని విడదీస్తుంది. ఇంకా చాలా దుర్మార్గాలు చేస్తుంది. ఎందుకిలా?!

ఎవరు చెబుతారు దీనికి సమాధానం.

పసితనం చేజారిపోయినందుకు ఎందరు ఏడుస్తున్నారో... ప్రేమ ఫలించక, విషాదాన్ని ఎందరు విషంలా మింగుతున్నారో... అనుకున్నవి జరక్కపోవడం... అనుకోనివి జరగటం... ఎందుకని?

దేవుడు కనిపిస్తే నేను ముందుగా అడిగే ప్రశ్నలివే. నేను నిలదీస్తానని ఆయనకి తెలుసు. అందుకే ఆయన కన్పించడు. కన్పించినా శిలాసదృశంగా... చెరగని మందహాసం చిందిస్తాడు. అన్ని ప్రశ్నలకి అదే ఆయన సమాధానం... గడుసువాడు.

దూరంగా రైలుకూత విన్పించింది. 'ప్లాట్‌ఫామ్' మీద సందడి పెరిగింది. తొంగిచూశాను. రైలు వస్తోంది. అందులోనే వైజయంతి రావాలి. తను వస్తున్నట్టు, స్టేషన్‌లో 'రిసీవ్' చేసుకోమనీ, ఎస్సెమ్మెస్ ఇచ్చింది. ఫోను చేయొచ్చుగా? చేస్తే వైజయంతి ఎందుకవుతుంది! ఉన్నాగా... అలనాటి బంట్రోతుని.. నేనే చేశాను.

"అవును...వస్తున్నాను. వచ్చాక మాట్లాడుకుందాం" ఈ మాటలకి, టెలిగ్రామ్‌కి అట్టే తేడా కన్పించదు. లోలోపల... మనసులో కాస్త మంట రగిలింది.

అది ఆమె మీద కోపమే. కానీ వ్యక్తం చేయలేను. ప్రేమనే దిగమింగి, ఇప్పటిదాకా మౌనంగా అష్టపదిలో ఆ మాట నా విషయంలో అక్షరాలా నిజం.

'నీ కోసమె నే జీవించునది' అని చెప్పాలనుకున్నప్పుడల్లా గొంతు పెగల్లేదు.

◆◆◆

వైజయంతిని నేను మామూలుగా ప్రేమించడం కాదు. అరాధించాను. ఆ విషయం ఎలా చెప్పాలో ఇప్పటికీ నాకు తెలిసి చావదు. నన్ను నేను ఈ విషయంలో ఎన్నోసార్లు తిట్టుకున్నాను. ఏం ఉపయోగం! వైజయంతి డాక్టరయింది. కార్డియాలజిస్టుగా దేశంలోనే గొప్ప డాక్టరుగా పేరు సంపాయించింది. ఢిల్లీలో ప్రముఖులందరూ ఆమె పేషెంట్లే!

దేశంలో గుండెజబ్బులెక్కువై పోతున్నాయ్. కారణాలు అనేకం. ప్రేమ కారణంగా గుండెజబ్బులు వచ్చే వాళ్ళెవరన్నా ఉన్నారా? అనుమానమే!

అసలు ప్రేమే ఒక కరువు పదార్థం. గుండె ఉన్నా ప్రేమ లేనివాళ్ళే అధికం. వైజయంతి ఎన్ని గుండెలు కోసిందో... బహుశా ఏ గుండెలోను ప్రేమ కన్పించి ఉండదు. రైలు అవుటర్‌లో ఆగిపోయినట్లుంది.

'క్లియరెన్స్'కి కూతవేస్తోంది.

ప్లాట్‌ఫామ్ మీద జనం ఆత్రుతగా రైలుకోసం పదే పదే తొంగిచూస్తున్నారు. నాకూ అతృతగానే ఉంది. కానీ, ప్లాట్‌ఫాం అంచుకెళ్ళి మాటిమాటికి తొంగిచూడాలనిపించటం లేదు.

నిశ్చలంగా నిలబడి వైజయంతి గురించే ఆలోచిస్తున్నాను. తెరమీద సినిమాలా గతమంతా మనసులో మెదుల్తోంది. కంగారులేదు. మరికాస్సేపటిలో వైజయంతి వచ్చేస్తుంది. అప్పుడిక ఆలోచనలకు అవకాశం ఉండదు. వైజయంతిని చూసి పదేళ్ళయింది.

ఇప్పుడెలా ఉందో, ఎలా ఉంటుంది. బంగారు బొమ్మలా ఉంటుంది. తనే యావరేజి!

బహుశా అందుకోసమే వైజయంతి తనని ప్రేమించలేదా? అవునేమో. అందం అందాన్నే ప్రేమిస్తుందా? మనసుని ప్రేమించదా?

తన మనసు సంగతి వైజయంతి కెలా తెలుస్తుంది? అవును. ఎలా తెలుస్తుంది.

ఎప్పుడు తను తన మనసు వెల్లడిచేశాడని?

సంకోచం... పిరికితనం... ఛఛ... లాభం లేదు. పిరికివాడు ప్రేమికుడిగా రాణించలేడు.

తనది మూగప్రేమ

వైజయంతి ఎవర్నన్నా ప్రేమించిందేమో. విజయవాడలో అలాంటిదేమీ లేదని నాకు తెలుసు. కానీ, ఢిల్లీ వెళ్ళాక... అక్కడ ఎన్నో పరిచయాలయ్యాక... ప్రేమించకుండా ఎలా ఉంటుంది.

అది కూడా పదేళ్ళు... ఇంపాజిబుల్... తనే... ఇంకా కొడిగట్టని ఆశలతో వైజయంతి మీద భ్రమలు పెట్టుకుని... పెళ్ళి మానేసుక్కూచున్నాడు.

ఈ సంగతి తన మేనత్త పసిగట్టింది. "ఎందుకలా దానిమీద ఆశలతో జీవితం పాడుచేసుకుంటావు" అంది జాలిగా. నవ్వి ఊరుకున్నాడు.

తండ్రి అప్పగించిన వ్యాపారాన్ని పదింతలు చేయగలిగాడు. పురప్రముఖుల్లో ఒకడైనాడు.. కానీ అన్నీ ఉండి...తోడులేక...ఒంటరితనంతో...ఏమీలేనివాడుగా ఉండిపోయాడు. ఇంతకీ వైజయంతి ఇప్పుడు విజయవాడ ఎందుకు వస్తున్నట్లు? తల్లిని తన దగ్గరే ఉంచుకుంది. బంధువుల ఇళ్ళకి వెళ్ళే అలవాటు లేదు. మా ఇంటికొచ్చేదా రాదు! మరి!? వస్తుందిగా...చూద్దాం.

ఉలిక్కిపడ్డాను. రైలు ప్లాట్‌ఫామ్ మీదకు వచ్చేసింది. గబగబా ఏసీ కోచ్ వైపు వెళ్ళాను.

రైలు పాంతం ఆగాక, వైజయంతి ఏసీ కోచ్ తలుపు దగ్గర మెరిసింది.

నేను దగ్గరకెళ్ళగానే చేతికి సామాను అందించింది. ప్లాట్‌ఫామ్ మీద ఉంచాను. దిగటానికి వీలుగా చెయ్యి అందించాను. గట్టిగా పట్టుకు దిగింది. "ఎలా ఉన్నావ్‌రా?" నవ్వుతూ పలకరించింది వైజయంతి.

"ఇలా ఉన్నాను" అన్నాను మందహాసంతో.

"పెళ్ళి చేసుకున్నావా?"

"నువ్వు చేసుకున్నావా?"

"లేదు..." ఆ జవాబు పూలచెండులా తాకింది.

'హమ్మయ్య' అనుకుని "నేనూ చేసుకోలేదే.." అన్నాను.

"ఎందుకని?" ఆశ్చర్యంగా అడిగింది.

"నా మనసుని అడుగు..." అంది.

"అదేమిట్రోయ్... కథలుగానీ రాస్తున్నావేంటి?" అని నవ్వుతూ సామాను కూలీకి అప్పగించింది.

"నేను మోద్దును కద?" అన్నాను పాత అలవాటుతో.

"ఇవి పుస్తకాలు కావు!" అంది గడుసుగా.

ఇద్దరం బయటకు నడిచాం.

◆ ◆ ◆

వైజయంతి నేనూ ఎదురెదురుగా కూర్చున్నాం. ఖరీదైన 'గేట్‌వే' హోటల్లో ఆమెకు బస ఏర్పాటు చేశారు. గుండెజబ్బుల మీద జరిగే సెమినార్‌లో ప్రత్యేక అతిథిగా. పాల్గొనేందుకు వచ్చింది. రెండు రోజులు ఉంటుంది. ఇవీ నేను తెలుసుకున్న వివరాలు.

"విజయవాడ చూసి చాలా రోజులైందిరా. సాయంత్రాలు ఖాళీగా ఉంటాను. అంతా తిప్పి చూపించు" అంది నిశ్శబ్దం భంగం చేస్తూ.

"మా ఇంటికి రావా?"

"ఏముందిరా మీ ఇల్లు చూట్టం తప్ప? అత్తయ్య, మామయ్య పోయాక ఎవర్ని చూట్టానికి రావాలి?"

"వాళ్ళున్నప్పుడూ రాలేదుగా?" నిష్ఠూరంగా అన్నాను.

"బంధువుల ఇళ్ళకి వెళ్ళాలనిపించదురా..." నిస్సహాయతగా అంది.

"పోన్లే... నువ్వెందుకు పెళ్ళిచేసుకోలేదో చెప్పు" తెగిన దారాన్ని మళ్ళీ ముడివేస్తూ అడిగాను.

"చేసుకుందామనే అనుకున్నాను. కానీ, నన్ను నన్నుగా చూసేవాడు ఒక్కడు కూడా కన్పించలేదురా. నన్ను ఒక డబ్బు ఆర్జించే యంత్రంగానో, అందచందాలున్న ఆడదిగానో, ఇంకేదోగానో తప్ప, మనసు, వ్యక్తిత్వం, అభిరుచులు, ఇష్టాయిష్టాలు గల మనిషిగా చూసేవారే కరువయ్యారు. విరక్తి కలిగింది. పెళ్ళి వ్యర్థమనుకున్నాను. నీ సంగతేమిటి?"

"విజ్జీ...నేను చిన్నప్పట్నుంచీ నిన్ను ప్రాణంకన్నా ఎక్కువగా ప్రేమిస్తున్నానే. ఈ సంగతి ఇన్నాళ్ళకి తెగించి చెప్పేస్తున్నానే. నువ్వు ఏమనుకున్నా ఫర్వాలేదు. ఎప్పటికైనా నువ్వు నన్ను అర్థం చేసుకోకపోతావా అని ఎదురుచూస్తున్నాను. నా దృష్టిలో నువ్వొక అపురూప వ్యక్తివి. నా ఆరాధ్య దేవతవి..." గొంతు గద్గదమైంది.

వైజయంతి నిశ్చేష్టురాలై వింది.

"నేను నిన్ను..."

"ప్లీజ్ విజ్జీ... నన్నలాంటి దృష్టితో ఎన్నడూ చూడలేదులాంటి మాటలు చెప్పి నా మనసుని హత్యచెయ్యకు. నువ్వు నన్ను పెళ్ళిచేసుకోకపోయినా ఫర్వాలేదు. కానీ, మాటలతో చంపొద్దు. నీకిష్టం లేకపోతే చెప్పు... ఎప్పటికీ ఇలాగే ఉండిపోతాను"

వైజయంతి ఆలోచనలో పడింది. చాలాసేపు మౌనంగా ఉండి "డిన్నర్ చేద్దామా?" అని అడిగింది.

"ఓకే" అన్నాను. బెల్‌కొట్టి డిన్నర్ ఆర్డర్ చేసింది.

వైజయంతి కోరిక ప్రకారం సాయంకాలం వేళల్లో విజయవాడ అంతా తిప్పాను. మేం చదువుకున్న స్కూలు చూపించాను. సంతోషించింది.

వెళ్ళేముందు రోజు మా ఇంటికి వచ్చింది.

"చాలా రిచ్‌గా ఉంది. డబ్బులు బాగా కుమ్మరించి నట్టున్నావ్" అంది మెచ్చుకోలుగా.

"థ్యాంక్స్" అన్నాను మందహాసంతో.

"నేనీ ఊరువస్తే నాకోసం ఒక ఆస్పత్రి కట్టించగలవా?"

"తప్పకుండా..."

"నేను నీ జీవితంలో కొస్తే నాకోసం ఏమైనా చేస్తావా?"

"అందుకు సందేహమెందుకు?"

"చివరి ప్రశ్న... నువ్వు నా అందాన్ని ప్రేమిస్తున్నావా? నా చదువునా? ఎందుకు నన్ను పెళ్ళిచేసుకోవాలను కుంటున్నావు?"

"విజ్జీ... నిన్ను నేను ప్రేమించడం ప్రారంభించినప్పుడు నువ్వేమీ కావు. నా మేనత్త కూతురివి. అంతే. ఇప్పటికీ నిన్ను అలాగే చూస్తున్నాను. గుర్తుందా! రైల్వేస్టేషల్లో నీ సామాను నేను మోస్తానన్నాను. మన స్కూలు రోజుల్లో అలా చేసేవాడిని..."

"ఒప్పుకున్నారా... నువ్వు నన్ను నన్ను గానే ప్రేమిస్తున్నావ్. నా కోసం ఏదైనా చేస్తావ్. అందుకే పెళ్ళికి ఒప్పుకుంటున్నా" అంది నవ్వుతూ.

ఇక నాకు నింగీ నేలా అన్నీ ఒకటిగానే కన్పిస్తున్నాయి. ప్రేమ కొందర్నయినా కనికరిస్తుందన్నమాట...

ధన్యోస్మి.